ప్రజాశక్తి

గురువారం 24 జూలై, 2025




వి.ఎస్ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు

# రేషన్ కార్డులకు దరఖాస్తుల వెల్లువ

**రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. కొత్త బియ్యం కార్డులు, మార్పులు, చేర్పులు, ఇతర సేవల కోసం వేలాది మంది దరఖాస్తు చేసుకుంటున్నారు. అర్హులైన పేదలకు బియ్యం కార్డులు జారీ చేసేందుకు గత నెల ఏడో తేదీ నుంచి ప్రభుత్వం దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించిన విషయం తెలిసిందే. కొత్త కార్డుల్లో కుటుంబ సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామా మార్పు, రైస్ కార్డు విభజన, కార్డు సరెండర్, ఆధార్ సరిచేయడం వంటి అంశాలకూ అవకాశం కల్పించడంతో సచివాలయాల్లో తమ వివరాలను నమోదు చేసుకుంటున్నారు. దరఖాస్తుదారుల నుంచి వచ్చిన వినతులను తహశీల్దార్లు పరిశీలించి అర్హులైన వారితో జాబితాలను ప్రభుత్వానికి పంపుతున్నారు.**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



- **కార్డుల కోసం ఇప్పటివరకు 67,313 అప్లికేషన్లు**
- **చేర్పులకు అత్యధికంగా 47,889 దరఖాస్తులు**
- **కొత్త బియ్యం కార్డులకు 4,595 మంది అర్హులుగా గుర్తింపు**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాయితీలకు రేషన్‌కార్డు తప్పనిసరి అయింది. ఇల్లు, ఇంటి స్థలం మంజూరు వంటి అంశాలకూ కార్డు అవసరమవుతోంది. గత ఐదేళ్లుగా కొత్తగా రేషన్‌కార్డులు మంజూరు చేయలేదు. దీంతో కుటుంబ సభ్యుల చేర్పు, తొలగింపుతో పాటు చిరునామాల మార్పు సవరణలకూ అవకాశం లేకుండా పోయింది. వీటితోపాటు కొత్తగా పెళ్లై, కుటుంబం నుంచి విడిగా ఉంటున్న వారు రేషన్‌కార్డుకు నోచుకోలేకపోయారు. ప్రభుత్వం ఈ ఏడాది మే ఏడో తేదీ నుంచి కొత్త రేషన్‌కార్డులు, ఇతర అంశాలకు వెబ్‌సైట్‌ను తెరిచింది. దీంతో అధిక సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. జిల్లాలో ఉన్న 732 గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఈ ప్రక్రియ సాగుతోంది. రేషన్‌కార్డుల జారీ, మార్పులు, చేర్పుల కోసం ప్రభుత్వం అవకాశం కల్పించడంతో ఉద్యోగం, ఉపాధి, వ్యాపారాల కోసం ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్న వారు తమ సొంత గ్రామాలకు చేరుకుని దరఖాస్తు చేసుకుంటున్నారు.

**పలురకాల సేవల కోసం 67,313 దరఖాస్తులు**

జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 67,313 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో సభ్యుల చేరిక కోసమే అధిక సంఖ్యలో దరఖాస్తులు చేరాయి. 47,889 మంది తమ కుటుంబ సభ్యులను కార్డులో చేర్చాలని విన్నవించారు. వాటిలో కొత్త బియ్యం కార్డుల కోసం 6,773 మంది దరఖాస్తు చేసుకున్నారు. బియ్యం కార్డు విభజన కోసం 6,832 అప్లికేషన్లు అందాయి. కుటుంబసభ్యుల తొలగింపు కోసం 1485 మంది అప్లికేషన్ పెట్టుకున్నారు. బియ్యం కార్డులో చిరునామా మార్పు కోసం 1,562 మంది, ఆధార్ అనుసంధానంలో దొర్లిన తప్పిదాలను సరిచేయాలంటూ 1,119 మంది దరఖాస్తు చేసుకున్నారు. 38 మంది రేషన్ కార్డులు స్వాధీనపరిచేందుకు సమ్మతి తెలిపారు.

**4,595 మందికి కొత్తగా బియ్యం కార్డులు**

సచివాలయాల ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో అర్హత ఉన్న వాటిని పరిశీలించి అప్రూవల్ చేస్తున్నారు. మిగిలిన వాటిని తిరస్కరిస్తున్నారు. మొత్తం 58,013 దరఖాస్తుల్లో 37,686 దరఖాస్తులను పరిగణనలోకి తీసుకున్నారు. విఆర్‌ఒలు పరిశీలించి తదుపరి పరిశీలన కోసం తహశీల్దార్లకు పంపుతున్నారు. 3,768 దరఖాస్తులను పరిష్కరించాల్సి ఉంది. అనర్హులు, సరైన పత్రాలు లేకపోవడం వంటి కారణాలతో 13,769 దరఖాస్తులను తిరస్కరించారు. కొత్త బియ్యం కార్డుల కోసం 4,595 మందిని అర్హులుగా గుర్తించారు.

**కొత్త కార్డుల జారీ ఎప్పుడో?**

జిల్లావ్యాప్తంగా 1,603 రేషన్ డిపోలు ఉన్నాయి. వాటిలో 1,592 చోట్ల ఈ-పోస్ యంత్రాల ద్వారా సరుకులను పంపిణీ చేయనున్నారు. మిగిలిన 11 డిపోలు మారుమూల ప్రాంతాల్లో ఉండడం, సిగ్నల్స్ సమస్య కారణంగా ఆ పరిధిలో ఉన్న లబ్ధిదారులకు ఆఫ్‌లైన్‌లో సరుకులు అందిస్తున్నారు. జిల్లాలో 1603 డిపోల పరిధిలో 6,60,739 కార్డులు ఉన్నాయి. వీటిలో 19,39,108 మంది సభ్యులుగా ఉన్నారు. కొత్త బియ్యం కార్డులు, ఇతర మార్పుల కోసం దరఖాస్తు చేసిన వారు ప్రభుత్వం వాటిని ఎప్పుడు మంజూరు చేస్తుందా అని ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. కార్డుల జారీకి ప్రభుత్వం నిర్దిష్ట గడువును విధించకపోవడంతో నెలన్నర రోజులుగా సచివాలయాలకు దరఖాస్తులు వస్తూనే ఉన్నాయి. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను సాగదీయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. గత సంవత్సరం కాలంగా అర్హులైన పేదలు కార్డులకు నోచుకోలేకపోయారు. కొత్త రేషన్‌కార్డులను ఫలానా తేదీ నుంచి ఇస్తామని ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ప్రకటన ఏదీ రాకపోవడంతో పేదల్లో తీవ్ర నిరాశ నెలకొంది.

# అచ్యుతానందన్ ఆశయసాధనకు కృషి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

దోపిడీ, పీడన లేని కార్మికవర్గ రాజ్య ఆశయం కోసం కేరళ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం పూర్వ పొలిట్‌బ్యూరో సభ్యులు వి.ఎస్ అచ్యుతానందన్ తన చివరి శ్వాస వరకు పనిచేశారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడమే ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుల బి.కృష్ణమూర్తి అన్నారు. అచ్యుతానందన్ సంతాప సభను నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమ నాయకునిగా అనేక పోరాటాల్లో కీలక వ్యక్తిగా వి.ఎస్ వ్యవహరించారని తెలిపారు. 17 ఏళ్లకే కమ్యూనిస్టు పార్టీలో సభ్యునిగా చేరారని చెప్పారు. కృష్ణ పిళ్లై నాయకత్వంలో భూస్వాములకు వ్యతిరేకంగా అనేక పోరాటాల్లో పాల్గొన్నారని, కార్మికులు, వ్యవసాయ కార్మికుల పోరాటాలకు ప్రత్యక్ష నాయకత్వం వహించారని తెలిపారు. కేరళలో కమ్యూనిస్టు పార్టీని అభివృద్ధి చేయడంలో కీలకమైన పాత్ర పోషించారన్నారు. 1956లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ సభ్యునిగా ఎన్నుకోబడ్డారని తెలిపారు. 1964లో సిపిఐ(ఎం) ఏర్పాటులో 32 మందిలో వి.ఎస్ అచ్యుతానందన్ ఒకరని, 1980 నుంచి 1991 వరకు కేరళ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారని చెప్పారు. 1964లో కేంద్ర కమిటీలోకి, 1986లో పొలిట్‌బ్యూరో సభ్యునిగా ఎన్నుకోబడ్డారని, 2022 వరకు కేంద్ర కమిటీలో కొనసాగారని తెలిపారు. కేరళ అసెంబ్లీకి ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని, రెండు పర్యాయాలు ప్రతిపక్షనేతగా, 2006 నుంచి 2011 వరకు ముఖ్యమంత్రిగానూ సేవలందించారని కొనియాడారు. ముఖ్యమంత్రిగా ఆయన పాలనలో ప్రజల సంక్షేమానికి అనేక చర్యలు చేపట్టారన్నారు. ఎనిమిది దశాబ్దాల పాటు కమ్యూనిస్టు ఉద్యమంలో అచ్యుతానందన్ కేరళ ఉద్యమానికి కీలక నాయకునిగా ఉన్నారని తెలిపారు. ఆయన మృతి పార్టీ ఉద్యమానికి, ప్రజలకు తీరని నష్టమన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.తేజేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు పి.ప్రసాదరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, ఎం.ఆదినారాయణ మూర్తి, కార్యదర్శి ఎన్.వి రమణ, కోశాధికారి అల్లు సత్యనారాయణ, పలు సంఘాల నాయకులు ఎం.గోవర్ధనరావు, ఆర్.ప్రకాశరావు, ఎ.సోమేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి



**శ్రీకాకుళం సిటీ:** ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కోసం డిఆర్‌ఒ, ఆర్‌డిఒ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగరాపు సింహాచలం డిమాండ్ చేశారు. నగరంలోని ఆ సంఘ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. 61 రోజులుగా ఆఫ్‌షోర్ నిర్వాసితులు నిరాహార దీక్షలు చేపడుతుంటే కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేకపోవడం అన్యాయమన్నారు. టెక్కలి ఆర్‌డిఒ, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు చీపురుపల్లిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరం వద్దకు వచ్చి నెల రోజుల్లో సమస్యను పరిష్కారం చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. 63 రోజులుగా చీపురుపల్లిలో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నా కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని సమావేశాన్ని ఏర్పాటు చేయించి నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సమస్యపై స్పందించకపోతే భవిష్యత్‌లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# నిర్దేశిత లక్ష్యాలు చేరుకోవాలి

## కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బ్యాంకర్లతో జిల్లా సంప్రదింపుల కమిటీ జిల్లాస్థాయి సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఎంఎస్‌ఎంఇ, మత్స్య, ఉద్యాన తదితర శాఖల లక్ష్యాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారులకు అవసరమైన రుణాలు, వాహనాలు, తదితర వాటిని బ్యాంకర్లు మంజూరు చేస్తున్నారని మత్స్యశాఖ డీడీ సత్యనారాయణ తెలిపారు. చేపల పెంపకానికి రుణాలు అవసరమా అని కలెక్టర్ అడగ్గా, చెరువులు లీజుకి ఇచ్చేటప్పుడు గ్రూపులకు ఇస్తామని డీడీ చెప్పారు. పిఎం సూర్యఘర్ పథకాన్ని ఎక్కువ మందికి వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని ఇడిసిఎల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నైపుణ్యాభివృద్ధి శాఖతో సంబంధం ఉన్న ప్రతి శాఖ సమన్వయంతో ఆయా శాఖలకు సంబంధించిన శిక్షణ తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులు ఒకసారి నైపుణ్యాభివృద్ధి శిక్షణా సంస్థను సందర్శించాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలను అమలు చేయాలని లీడ్ బ్యాంకు మేనేజర్ పి.శ్రీనివాసరావు బ్యాంకర్లకు సూచించారు. కిసాన్ క్రెడిట్ కార్డు, మత్స్యకారులకు, పశు సంవర్ధక శాఖలకు సంబంధించి రుణాలు అందిస్తామని నాబార్డు డీడీ ఎం.రమేష్‌కృష్ణ వివరించారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా బ్యాంకర్లు పనిచేయాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన కింద పంట రుణాలు తీసుకున్న ప్రతి రైతు ప్రీమియం చెల్లించి నమోదు కావాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బీమా ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో యుబిఐ ప్రాంతీయ అధిపతి పి.రాజ, డిసిసిబి జనరల్ మేనేజర్ వరప్రసాద్, ఉద్యానవన శాఖ ఎడి ప్రసాదరావు, ఎపిఎంఐపి డీడీ శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి త్రినాథస్వామి, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి

**ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు**

**జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె. అనిత**

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ


సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ అనిత

వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులకు అవకాశమున్నందున ముందస్తు జాగ్రత్తలు పాటించి అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత అన్నారు. నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నీటి ద్వారా, కలుషిత ఆహారం ద్వారా అధికంగా వ్యాధులు ప్రబలుతాయని తెలిపారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్యారోగ్య, ఆర్‌డబ్ల్యుఎస్, మున్సిపల్, పంచాయతీ శాఖలు కార్యాచరణ ప్రకారం చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించినట్లు చెప్పారు. తాగునీటి ట్యాంకులు, నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో తాగునీటి పరీక్షలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారని తెలిపారు. జనవరి నుంచి మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి కేసులు నమోదైనా, తొందరగా రోగులకు కోలుకున్నట్లు తెలిపారు. ఒడిశా నుంచి వచ్చిన రోగుల వల్ల కంచిలి ప్రాంతంలో 24 మలేరియా కేసులు నమోదైనట్లు వివరించారు. ప్రతి శుక్రవారం డ్రై డే (పరిసరాల పరిశుభ్రత) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా నీటి నిల్వలు, కొబ్బరి బొండాలు, ఖాళీ సీసాల్లో చేరిన నీటితో లార్వా వృద్ధి చెందకుండా దోమల నివారణకు పారిశుధ్య, పిచికారీ పనులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దోమల నిర్మూలనకు ఇండోర్ రీసెడ్యూయల్ స్ప్రేయింగ్, స్పేస్ స్ప్రేయింగ్, రీసెడ్యూయల్ స్ప్రే వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పైలట్ ప్రోగ్రామ్‌గా గిరిజన ప్రాంతాల్లో దట్టమైన పొదలు, వెళ్లేందుకు అవకాశం లేని ప్రాంతాల్లో దోమల నివారణకు డ్రోన్ సహాయంతో పిచికారీ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. వర్షాకాలంలో ఎక్కువగా అతిసార, టైఫాయిడ్, పచ్చకామెర్లు వంటి వ్యాధులు సంక్రమిస్తాయని ప్రజలు వీటిపై అవగాహన కలిగి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, తరచూ చేతులు శుభ్రం చేసుకోవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆహార పదార్థాలపై మూతలు పెట్టడం వంటి జాగ్రత్తలు పాటించాలన్నారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రామదాస్, ఎస్‌ఒ రామనాగేశ్వరరావు, ఎఒ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

# 28న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

పాతపట్నం మహేంద్ర డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈనెల 28వ తేదీన ఉదయం తొమ్మిది గంటలకు మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగావకాశాలను పొందేందుకు నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మేళాలో ప్రీమియర్ ఇంజినీర్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, అపిటోరియా, ఎన్.ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, ముత్తూట్ గ్రూప్, అపోలో ఫార్మసీస్ లిమిటెడ్‌తో కలిపి మొత్తం 13 కంపెనీలు పాల్గొనున్నాయని తెలిపారు. 562 ఖాళీలకు నియామకాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమో, డిగ్రీ, బి.ఫార్మసీ చదివిన 18 నుంచి 30 ఏళ్ల మధ్య యువత అర్హులని తెలిపారు. అభ్యర్థులు naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకుని, రిఫరెన్స్ నంబర్, రెజ్యూమ్, ఆధార్, విద్యార్హతల ఒరిజనల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకొచ్చి ఉదయం తొమ్మిది గంటలకు హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 83320 39243, 83176 52552 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.


మాట్లాడుతున్న ఎల్‌డిఎం శ్రీనివాసరావు

# ఆర్థిక అక్షరాస్యత అవసరం

ప్రజాశక్తి - గార

ఆర్థిక అక్షరాస్యత పొందడం అందరి బాధ్యత అని లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని శ్రీకూర్మంలో యూనియన్ బ్యాంకు ఆధ్వర్యాన బుధవారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎవరికీ ఒటిపిలు చెప్పకూడదన్నారు. ప్రతిఒక్కరూ కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలు నమోదు చేసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం, ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జూలై ఒకటి నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 917 గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా పోరుకు సిద్ధం

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు


సమావేశమైన గ్రామస్తులు

కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా ప్రజా పోరాటానికి సిద్ధమని గునుపల్లి గ్రామస్తులు స్పష్టం చేశారు. కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు అధ్యక్షతన బుధవారం గ్రామస్తులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పచ్చని ఉద్యానంలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని తమ గ్రామం తరుపున పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. కొబ్బరి, జీడి, పనస, మునగ, మామిడి వంటి పంటలు ఇక్కడి ప్రజలకు ఉపాధిని కల్పిస్తున్నాయన్నారు. ప్రభుత్వం ఏకపక్షంగా, ప్రజల ఆమోదం లేకుండా పోలీసు బలగాలను మోహరించి సర్వేల పేరిట రైతులకు నిద్ర లేకుండా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, అనధికారులు, ప్రైవేటు కంపెనీ తమ భూముల పైకి రావడం చూస్తుంటే తాము ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా, లేదా అనే సందేహం కలుగుతోందనారు. ప్రజల తరుపున నిలవాల్సిన ప్రభుత్వం బహుళజాతి కంపెనీలకు దళారీగా వ్యవహరిస్తోందని విమర్శించారు. బాధిత రైతు కుటుంబాలు దళారుల మాటలు విని మోసపోవద్దన్నారు. ఎవరెన్ని మాయమాటలు చెప్పినా తమ భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. సోంపేట థర్మల్ పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలా కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక ఉద్యమాన్ని నడుపుతామన్నారు. మహిళలు కోనేరు నానమ్మ, మైలపల్లి మాకమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే డబ్బు మాకొద్దని, తమ ఆస్తులే తమకు కావాలన్నారు. తిత్లీ తుపానులో సర్వం కోల్పోయి ఎంతో కష్టపడి మళ్లీ నిర్మించుకున్న పచ్చని ఉద్యానాన్ని నాశనం చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో రాంపురం సర్పంచ్ పొట్టి ధర్మారావు, మెట్టూరు సర్పంచ్ జోగి అప్పారావు, ఎంపిటిసి టి.రాజారావు, జోగి కామరాజు, జోగి శ్రీను పాల్గొన్నారు.

# ఇష్టారాజ్యంగా అజెండా తయారు చేస్తే ఆమోదించాలా?

## వైసిపి సభ్యుల వాకౌట్

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం నిర్వహించిన మున్సిపల్ సమావేశం నుంచి వైసిపి సభ్యులు వాకౌట్ చేశారు. మూకుమ్మడిగా తయారు చేసిన డీసెంట్ పత్రాలను చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ ఎన్.రామారావుకు అందజేశారు. సమావేశం ప్రారంభం కాక ముందే వైసిపి సభ్యులు దుర్గాశంకర్ పండా, పిచ్చుక అజయ్, పప్పల ప్రసాద్, మీసాల సురేష్ బాబులు మాట్లాడారు. మున్సిపాలిటీ ఏర్పాటై నాలుగేళ్లు గడిచినా కౌన్సిలర్లు ప్రతాపాధించిన అభివృద్ధి పనులు చేపట్టడం లేదని అన్నారు. గత సమావేశాల్లో ఆశీలు పాట వివరాలు, పారిశుధ్య వాహనాలు పరిస్థితి, ఖర్చు వివరాలు, వార్డుల్లో అభివృద్ధి పనులు జాబితాలను అడిగినా అధికారుల నుంచి సమాచారం ఇవ్వడం లేదన్నారు. వార్డుల్లో తాము ప్రతిపాదించిన పనులు పక్కన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కమిషనర్ సమాధానం ఇస్తూ...కౌన్సిలర్లకు తెలియకుండా ఏ పనీ చేపట్టమని అన్నారు.

చైర్మన్ మాట్లాడుతూ కౌన్సిలర్ల ప్రతిపాదనతో పాటు గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల మేరకు అన్ని అజెండా తయారు చేయడం చేశామన్నారు. కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ మాట్లాడుతూ వైసిపి నాయకులు వాకౌట్ చేసి అజెండాను వాయిదా వేయడం బాధాకరమని, దీనివల్ల మున్సిపాలిటీ అభివృద్ధి నిలిచిపోతుందని అన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ బోర బుజ్జి, కౌన్సిలర్లు గుజ్జు జోగారావు, బెల్లాల శ్రీను, నవర సోమేశ్వరరావు, శర్వాణి గీత, బళ్ల రేవతి, బోర చంద్రకళ, బడగల సుజాత, కో-ఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్ పాల్గొన్నారు.


చైర్మన్ గిరిబాబుకు డీసెంట్ పత్రాన్ని అందజేస్తున్న వైసిపి కౌన్సిలర్లు


మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ

# స.హ చట్టంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రజలకు పారదర్శకంగా సమాచారాన్ని అందించడంలో సమాచార హక్కు చట్టం-2005 కీలకభూమిక పోషిస్తుందని జిల్లా సహకార అధికారి బి.మురళీకృష్ణ అన్నారు. సహకార సంఘాల కమిషనర్, రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు జిల్లా సహకార అధికారి కార్యాలయంలో ఆర్‌టిఐపై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్రజలకు సమయానుకూలంగా, సక్రమమైన సమాచారం అందించడమే సహకార విభాగం లక్ష్యమన్నారు. నిబంధనల మేరకు సమాచారం అందించే వ్యవస్థను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. సహకార శాఖలో పారదర్శక పాలన సాగుతోందన్నారు. ఈ సందర్భంగా అధికారులు ఆర్‌టిఐ చట్టంలోని నిబంధనలు, సమాచార హక్కు వినియోగ విధానం, పిఐఒ బాధ్యతలు, సమాచారాన్ని నిర్దిష్ట గడువులో అందించాల్సిన అవసరాన్ని వివరించారు. సదస్సులో డివిజనల్ సహకార అధికారులు, జిల్లా సహకార ఆడిట్ అధికారి, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, సహకార మార్కెటింగ్ సొసైటీ పిఐఒలు, ఎపిఐఒలు పాల్గొన్నారు.

# ఖర్గేని కలిసిన కృపారాణి


ఖర్గేతో కృపారాణి

**టెక్కలి :** ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి ఢిల్లీలో బుధ వారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆంధ్రాలో కాంగ్రెస్ పార్టీ విజయాలు, రాజకీయం వంటి అంశాలపై చర్చించారు. ఇటీవల రాహుల్‌గాంధీని కలిసిన ఆమె బుధవారం ఖర్గేను కలవడంపై రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. త్వరలో ఖాళీ అవుతున్న రాజ్యసభ సీటు కోసం కృపారాణి యత్నిస్తున్నట్లు సమాచారం. ఈమెతో పాటు డాక్టర్ కిల్లి రామ్మోహనరావు కూడా ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న పీడీ శాంతిశ్రీ

## సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించాలి

**ప్రజాశక్తి- పలాస**

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని క్షేత్రస్థాయిలో అంగన్వాడీల సేవలు లబ్ధిదారులకు చేరే విధంగా కృషి చేయాలని శిశు సంక్షేమశాఖ పీడీ బి.శాంతిశ్రీ అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మొగిలిపాడు ఒకటో అంగన్వాడీ కేంద్రాన్ని బుధవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో లబ్ధిదారుల వివరాలను విధిగా నమోదు చేస్తూ పెరుగుదల పర్యవేక్షణ, వెయ్యి రోజుల తల్లీబిడ్డల పర్యవేక్షణపై దృష్టిసారించాలన్నారు. క్షేత్రస్థాయిలో అంగన్వాడీ కార్యకర్తలు పూర్వ ప్రాథమిక విద్య, ఆరోగ్యలక్ష్మి, ఆవరణలో పెరటి తోటల పెంపకాలపై శ్రద్ధ చూపించాలని పేర్కొన్నారు. సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి ఆహార నిల్వలపై ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. పౌష్టికాహారంలో ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాశీబుగ్గ ప్రాజెక్టు అధికారి కె.పార్వతి, సూపర్వైజర్లు పి.గంగమ్మ, యు.లత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బృంద సభ్యులు

## తాళ్లవలసలో కేంద్ర బృందం పర్యటన

**సంతబొమ్మాళి:** మండలంలోని తాళ్లవలస పంచాయతీలో ఎన్ఎల్ఎం కేంద్ర బృంద సభ్యులు సునీల్ బంటా, నాలో సింగ్ బుధవారం పర్యటించారు. పంచాయతీలోని ఉపాధి హామీ అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించారు. స్వయం సహాయ సమూహాల ద్వారా ఆర్థిక స్వావలంబన సమాఖ్య పంచాయతీ ప్రొఫైల్, పరిపాలనా రికార్డులు, తను పంపిణీ ద్రవీభవనలు క్షుణ్ణంగా పరిశీలించారు. అభివృద్ధి పనులపై, అధికారుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎపిడి తైజల, ఎంపిడిఒ పి.ఆయురుప్రసాద్, ఎపిఒ నర్సింహమూర్తి, కార్యదర్శులు జి.విజయకుమార్, డి.శ్రీనివాస్, ఉమాపతి, గోవింద, సీఎఫ్ శోభారాణి, ఫీల్డ్ అసిస్టెంట్ వి.గిరి పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఎంఇఒ దాలినాయుడు

## బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

**నరసన్నపేట:** మండలంలోని రావులవలసలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు పొన్నాడ సంధ్యారాణి, దుంగ రూన్సీ, ఇప్పిలి మంగమ్మ, బి.వెంకటలక్ష్మిలు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బుధవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలోను, సామర్థ్యాలు సాధించడంలోను వీరు చేసిన కృషి అమోఘమని ఎంఇఒ పేడాడ దాలినాయుడు కొనియాడారు. ప్రధానోపాధ్యాయులు బమ్మిడి శ్రీరామ్మూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎం.లక్ష్మీనారాయణ, బి.పద్మజ, కె.పావని, ఎం.రాంబాబు, పాఠశాల విద్యా కమిటీ వైస్ చైర్మన్ సింహాచలం, మద్ది కృష్ణ పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న సింహాచలం

## సాగునీరు విడుదల చేయాలి

**ప్రజాశక్తి- కొత్తూరు**

సకాలంలో వర్షాలు లేకపోవడంతో వరి నారుమళ్లు, ఎదలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వం స్పందించి సాగునీటిని విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం డిమాండ్ చేశారు. మండలంలోని గులివెందలపేటలో ఎండి వరి పంట పొలాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండిన వరి నాట్లు పొలాలను చూసి రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. మండలంలో కరువు ఛాయలు కనిపిస్తున్నాయని అన్నారు. సాగునీరు విడుదల చేస్తే దమ్ములకు పట్టేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారన్నారు. భూమిని నమ్ముకున్న రైతులు వేరే పని లేక అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వం కరువు సహాయక చర్యలు చేపట్టడానికి సిద్ధంగా ఉండాలన్నారు.

## పి-4పై అవగాహన కల్పించాలి

**నరసన్నపేట:** ప్రభుత్వం పి4 సర్వే కార్యక్రమం నిర్వహిస్తుందని, గ్రామసభలు నిర్వహించి దాని ప్రాధాన్యతను ప్రజలకు అవగాహన కల్పించాలని టిడిపి వాణిజ్యశాఖ రాష్ట్ర కార్యదర్శి జామి వెంకటరావు సూచించారు. ఈ మేరకు పంచాయతీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. అదికారులు ఈ సర్వేను గ్రామసభలను తుతూమంత్రంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల పేదలకు న్యాయం జరగదని అన్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు పి4 సర్వే గ్రామసభలు నిర్వహించి అవగాహన కల్పించాలని కోరారు.

# యూరియా పంపిణీ నిలిపివేత

**ప్రజాశక్తి- సరుబుజ్జిలి**

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతు భరోసా, అన్నదాత సుఖీభవ అంటూ పంట పెట్టుబడి సాయం అందిస్తున్నారు తప్ప అవసరం మేరకు విత్తనాలు, ఎరువులు అందించడంలో విఫలమవుతున్నారని రైతుల నుంచి విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. ప్రస్తుత ఖరీఫ్ సాగు చేస్తున్న రైతులకు ఎరువుల కోసం ఎదురుచూపులే మిగులుతున్నాయని, పంపిణీలో వ్యవసాయ అధికారులు విఫలం అవుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. మండలంలో కొన్ని గ్రామాలకు ఎరువులు కేటాయిస్తున్నప్పటికీ వాటిని దక్కించుకోవడానికి సచివాలయం వద్దకు చేరుకున్న రైతుల మధ్య వివాదాలు చెలరేగుతున్నాయి. అదే పూర్తిస్థాయిలో ఎరువులు సరఫరా జరిగితే ఈ పరిస్థితి ఏర్పడదని కొంతమంది రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస గ్రామ సచివాలయ పరిధిలో బుధవారం వ్యవసాయ అధికారులు 440 యూరియా బస్తాల పంపిణీకి చర్యలు చేపట్టారు. అప్పటికే కొంతమంది రైతులు యూరియా కొనుగోలుకు ఆధార్, పట్టాదారు పాసుపుస్తకాలతో తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలపగా అదే సమయంలో గ్రామానికి చెందిన మరికొంత మంది రైతులు అక్కడకి చేరుకొని తమకు యూరియా బస్తాలు కేటాయించాలని కోరారు. ముందుగా నమోదు చేసుకుని క్యూలో ఉన్న రైతులకు యూరియా బస్తాలు అందించిన తర్వాతే మిగిలిన



కానిస్టేబుల్, సర్పంచ్ ప్రతినిధి రమణ మధ్య జరుగుతున్న వాగ్వివాదం

వారికి ఇవ్వాలని ఒక వర్గం, రెండు వర్గాలకు సమానంగా పంపిణీ చేయాలని మరో వర్గం వ్యవసాయ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో ఈ విషయం వివాదంగా మారి ఇరు వర్గాల రైతులు వాదోప వాదాలతో తోపులాటలు ప్రారంభించడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న సరుబుజ్జిలి పోలీసులు రొట్టవలస గ్రామ సచివాలయం వద్దకు చేరుకొని ఇరు వర్గాలను సముదాయించి నచ్చ చెబుతున్న సమయంలో సర్పంచ్ ప్రతినిధి మూడడ్ల రమణపై ఒక కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తించడంతో పోలీసులకు సర్పంచ్ వర్గంకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అధికారులు, పోలీసులు నచ్చ చెప్పినప్పటికీ ఇరువర్గాల రైతులు వినుకోకపోవడంతో ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారానికి అధికారులు వాయిదా వేశారు.

# ఔదార్యం చాటుకున్న కార్మికులు



చెక్కులను అందజేస్తున్న యాజమాన్య ప్రతినిధులు, సిఐటియు నాయకులు

**ప్రజాశక్తి- ఎచ్చెర్ల**

నాగార్జున అగ్రికం కార్మికులు, ఉద్యోగుల ఔదార్యాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎన్ఎసిఎల్ సిహెచ్ఆర్ఒ అండ్ విపి సిఆర్ శ్రీనివాస్, హెచ్.పి.డి.హెడ్ కె.శ్యాంప్రసాదరావు అభినందించారు. నాగార్జున అగ్రికం పరిశ్రమలో పనిచేస్తూ కార్మికుడు గొర్లె. చిట్టిబాబు, బోనంగి. భాస్కరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం మృతుల కుటుంబాలకు ఎన్ఎసిఎల్ ఇండస్ట్రీస్ పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు ఒకరోజు వేతనాన్ని విరాళంగా వసూలు చేసి ఇచ్చిన మొత్తాన్ని పరిశ్రమలో జరిగిన సమావేశంలో మృతుల భార్యలు గొర్లె పద్మావతికి రూ.11,41,175, బోనంగి ఆదిలక్ష్మికి రూ.11,34,654 చెక్కులను యాజమాన్య ప్రతినిధులు, సిఐటియు, యూనియన్ నాయకుల చేతులమీదుగా అందజేశారు. ఒకరోజు వేతనంతో పాటు గ్రాడ్యుటీతో కలుపుకొని మొత్తం ఇద్దరికి రూ. 22,75,829 అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులుగా పనిచేస్తూ ఏ ఒక్కరు చనిపోయినా తమతో పాటు పనిచేస్తున్న కార్మికులంతా ఒకరోజు వేతనం ఇవ్వడం అభినందించదగ్గ విషయమన్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భరోసా ఏర్పడుతుందన్నారు. మృతుల కుటుంబసభ్యులు వచ్చిన డబ్బులు జాగ్రత్తగా పిల్లలు పేరుతో పొదుపు చేయడం ద్వారా వారి విద్యాభ్యాసం, ఇతర అవసరాలకు ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో నాగార్జున అగ్రికం వర్కర్స్ యూనియన్ నాయకులు ఎల్.రామప్పడు, ఎం.రమణ, ఎల్.చిరంజీవి, సిహెచ్ సత్యనారాయణ, ఎస్.పరశరామ్, పి.చిన్న తదితరులు పాల్గొన్నారు.

## శ్మశానవాటికకు స్థలం కేటాయింపు


**ప్రజాశక్తి- లావేరు**

మండలంలోని సిగురికొత్తపల్లి పంచాయతీ వెంకటరావుపేట రెవెన్యూ గ్రామానికి రెవెన్యూ అధికారులు ఎట్టకేలకు శ్మశాన వాటికకు స్థలం కేటాయించారు. ఇటీవల పాత శ్మశానం కోసం బెజ్జపురం వెంకటరావుపేట గ్రామాల మధ్య వివాదం తలెత్తింది. వెంకటరావుపేట గ్రామంలో వ్యక్తి మృతి చెందగా ఎప్పటివలే అంత్యక్రియలకు మృతదేహాన్ని తీసుకెళ్లగా మాభూమిలో ఎట్టి పరిస్థితుల్లో మృతదేహానికి అంత్యక్రియలు చేయనివ్వమని, ఆ స్థలం మా జిరాయితీ అని బెజ్జపురం గ్రామస్తులు ససేమిరా ఒప్పుకోకపోవడంతో రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రత్యామ్నాయంగా అప్పటికప్పుడు ప్రభుత్వ స్థలం చూపించడంతో పరిస్థితి సద్దుమణిగింది. తర్వాత తమ గ్రామానికి స్మశానవాటిక స్థలాన్ని ప్రభుత్వం కేటాయించాలని ఆ గ్రామస్తులు గ్రామంలో ఆందోళన చేపట్టారు. ఇటీవల తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. దీంతో తహశీల్దార్ జిఇఎల్



శ్మశానవాటికకు స్థలాన్ని పరిశీలించి అప్పగిస్తున్న తహశీల్దార్

శ్రీనివాసరావు, మండల సర్వేయర్ బచ్చు శ్రీధర్‌రెడ్డితో కూడిన రెవెన్యూ బృందం బుధవారం వెంకటరావు పేట గ్రామానికి వెళ్లి ఎల్‌పిఎం నెంబర్ 434 సర్వే నంబర్ 24-6లో 0.4 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించినట్లు తహశీల్దార్ శ్రీనువాసరావు తెలిపారు. దీంతో వెంకటరావు పేట గ్రామానికి శ్మశానవాటిక సమస్య పరిష్కారమవ్వడంతో ఆ గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకులు రత్నాకర్, విఎస్ మజ్జి అయ్యప్పలనాయుడు, విఆర్ఒలు రామారావు, గోవిందరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



చిన్నారులను పరీక్షిస్తున్న డాక్టర్ సురేష్ కుమార్

## వైరల్ జ్వరాలపై అప్రమత్తం

**ప్రజాశక్తి- కవిటి**

వాతావరణంలో వచ్చిన మార్పుల దష్ట్యా చిన్నారుల్లో వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని, వీటి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ సమయానికి వైద్యులను సంప్రదించాలని చిన్న పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ బాలక సురేష్ తెలిపారు. చిన్నారుల్లో రోజురోజుకూ పెరుగుతున్న వ్యాధుల దృష్ట్యా బుధవారం ప్రభుత్వాస్పత్రిలో రోగులను పరీక్షిస్తూ ప్రజాశక్తితో మాట్లాడారు. ఇటీవల వస్తున్న చాలామంది చిన్నారుల్లో కొన్ని టెస్టులు చేసినా వ్యాధి నిర్ధారణ కాదని కానీ వారికి సమయాన్నికూలంగా వైద్యాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. మరికొంతమంది పిల్లల్లో ఇమ్యూనిటీ పవర్ తక్కువగా ఉండడం వల్ల కూడా కొన్ని సమస్యలు వస్తున్నట్లు తెలిపారు. వ్యాధి నిర్ధారణ కాని, కారణాలు లేని జ్వరాలతో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. అటువంటి లక్షణాలతో ప్రస్తుతం ఒక చిన్నారి తన వద్ద చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

# మెరిసిన ఎస్‌విజె విద్యార్థులు

**ప్రజాశక్తి- కవిటి**

తలసేమియా అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఎన్టిఆర్ ట్రస్టు ఆధ్వర్యాన విశాఖ ఆర్‌కె బీచ్‌లో నిర్వహించిన తలసేమియా 3కె రన్ 2025 ఈవెంట్‌లో ఎస్‌విజె విద్యార్థులు సత్తాచాటారు. ఈవెంట్‌లో 17 మంది ఎస్‌విజె విద్యార్థులు పాల్గొని ప్రతిభాపాటవాలు ప్రదర్శించారు. వీరిలో ఎస్.తిరుపతి ఆరో స్థానం, రాజేష్ తొమ్మిదో స్థానం, తేజ పదో స్థానం సాధించి ఉత్తమ ఫినిషర్స్ జాబితాలో చోటు సంపాదించారు. వీరి ప్రతిభను గుర్తించిన ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌విజె యాజమాన్యం ప్రతినిధులు బి.వి.వి.ప్రసాదరావు, బి.ఝూన్సీ, పిఇటి జె.ముకుంద, ఎఒ జోష్ కుమార్, డిగ్రీ, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాళ్లు, స్కూల్ హెడ్ మాస్టర్ బి.జగ్గారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### దీక్షిత ప్రతిభ

నెలవంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాగ దీక్షిత 3కె రన్ లో సత్తా చాటింది. 30 వేల మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో ఫినిషింగ్ వంద మందిలో చోటు సంపాదించింది. ఈ సందర్భంగా ఎంఇఒ ధనుంజయ మజ్జి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగయ్య, ఉపాధ్యాయ సిబ్బంది బాగ దీక్షితకు మెడల్‌తో సత్కరించి అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న విప్ అశోక్

# బాలికలకు అవగాహన కల్పించాలి

**ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ**

బాలికలు, విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్నందుకు ఎస్ఎఫ్ఎల్‌బి బృందానికి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అభినందించారు. స్వామిబాబు, వజ్రమ్మ చారిట బుల్ ట్రస్ట్, పడాల ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా స్వేచ్ఛ ఫర్ లిటిల్ బర్డ్స్ పిల్లల సంరక్షణ కోసం స్వేచ్ఛ ఫర్ లిటిల్ బర్డ్స్ రూపొందించిన అవగాహన పోస్టర్‌ను బుధవారం కలెక్టర్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1 నుంచి ఏడో తరగతి పిల్లలకు, ప్రైవేట్ పార్ట్స్, సేఫ్ టచ్, అన్ సేఫ్ టచ్, సేఫ్టీ రూల్స్, బుల్లియింగ్, పోక్సో చట్టం, ఇంటర్నెట్ సేఫ్టీ వంటి విషయాలు, పర్సనల్ సేఫ్టీ ఎడ్యుకేషన్ అనే మాడ్యూల్ ద్వారా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లల భద్రత, రక్షణ మన అందరి బాధ్యతని, ప్రతి స్కూల్‌లో, కాలేజీ, వసతిగృహాల్లో, ఇంట్లో పిల్లలు క్షేమంగా ఉండాలని చెప్పారు. స్వామిబాబు, వజ్రమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న పిల్లలకు ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందని ట్రస్ట్ చైర్మన్ కోరాడ



పోస్టర్‌ను అవిష్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రవీంద్రనాథ్ తెలిపారు. పడాల చారిటబుల్ ట్రస్ట్ ప్రాజెక్టు సిఇఒ పడాల సూర్యప్రసాద్ మాట్లాడుతూ గత మూడేళ్లుగా ఈ కార్యక్రమం ద్వారా 470 స్కూల్స్‌లో ఉన్న 47 వేల మంది పిల్లలకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఈ అవగాహన తరగతుల ద్వారా చిన్న వయసులోనే లైంగిక వేధింపులపై తెలుసుకోవడం, వాటి నుంచి తప్పించుకోవడం, ఫిర్యాదు చేయడం వంటి కీలకమైన అంశాలు పిల్లలు నేర్చుకుంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ, రమేష్, కరుణశ్రీ, శ్రావణి పాల్గొన్నారు.

## 3 నుంచి జిల్లాస్థాయి యోగా పోటీలు

**నరసన్నపేట:** వచ్చే 3 నుంచి జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు వివేకానంద ధ్యాన యోగా సమితి అధ్యక్షులు కింజరాపు రామారావు తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిను బుధవారం ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 3న ఉదయం 7 గంటల ప్రారంభమై సాయంత్రం వరకు వరకూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు కేటగిరీ పోటీలో పాల్గొనవచ్చునని అన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 919676472733, 919492266889, 91 94902 83787 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సదశివుని రవిప్రసాద్, పసుపురెడ్డి మల్లిబాబు, ప్రధాన కార్యదర్శి కుప్పిలి హరికుమార్, వండాన సుప్రజ, కార్యదర్శులు పొన్నాడ దుర్గాప్రసాద్, బలగ ప్రహర్ష, ప్రచార కార్యదర్శి కోరాడ భాగ్యలక్ష్మి, కోశాధికారి వారణాసి సంతోషికుమారి, బరాటం శంకరరావు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంజిఆర్

## సిఎంను కలిసిన ఎంజిఆర్

**పాతపట్నం:** అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఎమ్మెల్యే మామిడి గోవింద రావు బుధవారం కలిశారు. నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై పలు వినతులు సమర్పించారు. ఉద్దానం ఫేజ్-2, జలజీవన్ మిషన్ కింద రూ.265 కోట్ల నిధులతో ఇంటింటికి తాగునీటి పైపులైన్ పనులను తక్షణమే ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఏర్పాటు చేయాలని, వంశధార గొట్టబ్యారేజ్ మరమ్మతులు, కుడి, ఎడమ ప్రధాన కాలువల మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరారు. వీటిపై సిఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

## జిఒ 3ను పునరుద్ధరించాలి



ఆదినారాయణ

**మెళియాపుట్టి :** ఆదివాసీల అభివృద్ధికి పనిచేసే ఐటిడిఎల పరిధిలో అడవి బిడ్డల ఉద్యోగ భద్రతను కాపాడేందుకు తీసుకొచ్చిన జిఒ నంబరు 3ను పునరుద్ధరించాలని గిరిజన సంఘ నాయకుడు, వైస్ ఎంపిపి సవర ఆదినాయుడు కోరారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. అన్ని రంగాల్లో వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్న గిరిజనులకు ఉద్యోగ భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గిరిజన చట్ట ఉల్లంఘన వల్ల గిరిజనులు, యువతకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జిఒ 3ను పునరుద్ధరించాలని, లేదంటే గిరిజనుల హక్కుల కోసం పోరాటం తప్పదని హెచ్చరించారు.

## అనుమానాస్పదంగా యువకుడు మృతి

**ఎచ్చెర్ల:** మండల పరిధిలో కేశవరావుపేటకు చెందిన సిపాన చలపతిరావు (29) బుధవారం అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు చలపతిరావు మంగళవారం రాత్రి జరజాం సమీపంలోని ఓ లేఅవుట్‌లో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని, సాయంత్రమైనా ఎప్పటికీ రాకపోవటంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది ఫోన్ చేయగా ఫోను రింగ్ అవుతున్నా ఎప్పటికీ లిఫ్ట్ చేయకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా జరజాం వెళ్లే రహదారి మార్గంలో లేఅవుట్‌లో స్పృహ కోల్పోయి ఉన్నట్లు గుర్తించారు. చలపతిరావు పక్కన మద్యం సీసాలు ఉన్నట్టు గమనించి ఇంటికి తీసుకువెళ్లారు. బుధవారం తెల్లవారి చలపతిరావు నోటినుంచి నురగ వచ్చి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించి శ్రీకాకుళంలో సర్వజనా స్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అందజేశారు. తండ్రి అనంత ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పశువుల పట్టివేత

**ఎచ్చెర్ల:** మండల పరిధిలో నవభారత్ కూడలి వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్నారు. రెండు వ్యాన్లులో ఏడు ఎద్దులు, 10 ఆవులను స్వాధీనం చేసుకొని గోశాలకు తరలించారు. ఈ పశువులు నారాయణ వలస సంత నుంచి అలమండ సంతకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బాధ్యులపై ఎస్ఐ వి.సందీప్ కుమార్. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



టెక్కలి రూరల్ : నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

## గంజాయితో నలుగురు అరెస్టు

**ప్రజాశక్తి- టెక్కలి రూరల్**

టెక్కలి జాతీయ రహదారిపై ఒక దాభా వద్ద బుధవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టామని సిఐ ఎ.విజయకుమార్ తెలిపారు. తనిఖీలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన నలుగురు వ్యక్తులు 4.75 కేజీలు గంజాయి రవాణా చేస్తుండగా పట్టుబడ్డారని అన్నారు. యువకులు చెడువ్యసనాలకు బానిసై జైపూర్‌లో గంజాయి కొనుగోలు చేసి బెంగళూరుకు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. గోపాలసర్దార్, సుమన్‌దాస్, మహదేవ్ నాయక్, సుమన్ మెండెల్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రెండు ద్విచక్ర వాహనాలు సీజ్ చేశామన్నారు. ఈయనతో పాటు ఎస్ఐలు రాము, రఘువందనరావు, సిబ్బంది ఉన్నారు.

### ఇచ్ఛాపురంలో వ్యక్తి...

**ఇచ్ఛాపురం :** ఇచ్ఛాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న దీప్‌కుమార్ నాయక్‌ను అరెస్టు చేశామని ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఒడిశా నుంచి అక్రమంగా 20.260 కిలోల గంజాయి తరలిస్తుండగా పట్టుబడ్డారని అన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని ఆయనను అరెస్టు చేశామన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

## రక్షణ గోడ ఎప్పుడు నిర్మిస్తారు

### ఎమ్మెల్యేను నిలదీసిన మత్స్యకారులు

**ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్**

పెద్ద గనగల్లవాని పేట సముద్ర తీర ప్రాంతంలో రక్షణ గోడ ఎప్పుడు నిర్మిస్తారని ఎమ్మెల్యే గొండు శంకర్‌ను మత్స్యకారులు నిలదీశారు. మండలంలోని కల్లేపల్లి, పెద్దగనగల్లవానిపేటలో బుధవారం సుపరిపాలన తొలిగడుపు కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేని కోరారు. వెంటనే సంబంధిత ఎఇని పిలిచి గనగల్లవానిపేట గ్రామంలో చాలా వీధులకు సిసిరోడ్లు మంజూరయ్యాయని, వెంటనే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి టిడిపి అమలు చేస్తున్న పథకాలు అందుతున్నాయా లేదో అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు రూరల్ మండల అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, అమ్మాజీరావు, అప్పలస్వామి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.




రికార్డులు పరిశీలిస్తున్న సిడిపిఒ గీత

## అంగన్వాడీ కేంద్రంపై విచారణ

**సరుబుజ్జిలి:** మండలంలోని గోనెపాడు గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంపై గత కొన్ని రోజులుగా వస్తున్న ఆరోపణలపై బూర్జ సిడిపిఒ గీత విచారణ చేపట్టారు. బుధవారం కేంద్రంలో లబ్ధి పొందుతున్న సుమారు 15 మంది లబ్ధిదారులతో సిడిపిఒ గీత మాట్లాడి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిఒ గీత విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ఈ కేంద్రంపై కొన్ని ఆరోపణలు రావడం జరిగిందని, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గ్రామానికి చేరుకొని విచారణ నిర్వహించగా లబ్ధిదారులందరూ తమకు కేంద్రం నుంచి అందాల్సిన పౌష్టికాహార పదార్థాలన్నీ సక్రంగా అందుతున్నాయని తెలిపారన్నారు. అంగన్వాడీ కార్యకర్త జ్యోతి కేంద్రంలో పిల్లలను సక్రమంగానే చూసుకుంటున్నారని, పిల్లల ఆలనా పాలన, విద్యాబుద్దులు తదితర విషయాల్లో సక్రమంగానే నడుచుకుంటున్నారని పిల్లల తల్లి దండ్రులు ఆమె దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అమ్మనమ్మ, అంగన్వాడీ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పూర్తిస్థాయిలో యూరియా సరఫరా



సీతారాం బాబు

**బూర్జ:** మండలంలో రైతులకు పూర్తిస్థాయిలో యూరియా సరఫరా చేయడం జరిగిందని టిడిపి మండల అధ్యక్షుడు వావిలపల్లి సీతారాం బాబు నాయుడు అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో యురియా కొరత ఉందని వైసిపి నాయకులు, కార్యకర్తలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఇంతవరకు మండలంలో 16 రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులను, యూరియా అందజేయడం జరిగిందన్నారు. పూర్తిస్థాయిలో రైతులకు యూరియా సరఫరా చేసేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కేవలం ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని వాటిని మానుకోవాలన్నారు.

# ఈదురుగాలులకు నేలవాలిన చెరుకు

**ప్రజాశక్తి- బూర్జ**

మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి చెరుకు పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. గత పది రోజులుగా మొహం చాటేసిన వరుణుడు బుధవారం తన ప్రతాపాన్ని చూపించాడు. మధ్యాహ్నం వరకు ఎండ విపరీతంగా ఉన్నప్పటికీ మధ్యాహ్నం రెండు గంటలకు ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చి పెనుగాలులతో పాటు భారీ వర్షం కురిసింది. మండలంలోని అల్లెన, వావాం, లాభం, బూర్జ తదితర గ్రామాల్లో చెరుకు పంట నేలకొరిగింది. మరో మూడు నెలల్లో పంట చేతికి వచ్చే సమయంలో గాలి, వర్షం కారణంగా చెరుకు పంట పూర్తిగా నష్టపోయిన పరిస్థితి దాపురించిందని చెరుకు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి సాగులో నష్టాలు చవిచూస్తున్న తాము చెరుకు పంట వైపు మొగ్గు చూపించామని తెలిపారు.

### నష్టం అపారం

బుధవారం కురిసిన వర్షం అపార నష్టం మిగిల్చిందని రైతులు వాపోతున్నారు. జనవరి నెలలో చెరుకు పంటకు



నేలకొరిగిన చెరుకు పంట

పూనుకున్నామని, చెరుకు గడలకు జతలు కట్టే సమయంలో వర్షం నిండా ముంచిందని రైతులు తెలిపారు. మండలంలో ఆయా గ్రామాల్లో 50 ఎకరాలకు పైగా చెరుకు పంటకు నష్టం వాటిల్లిందని రైతుల తెలిపారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి చెరుకు పంటను పండించేందుకు సిద్ధమైన తమకు భారీ వర్షంతో నష్టం వాటిల్లిందని, దీనిపై ప్రభుత్వం పరిశీలన జరిపి చెరుకు రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

# అక్రమ కట్టడం అడ్డుకోరా?

**ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ**

నగరంలో ప్లానింగ్ లేని నిర్మాణాలు భవిష్యత్‌లో సమస్యగా మారే అవకాశం ఉంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవటం సమస్యగా మారుతుంది. నగరంలోని చౌక్‌బజారు రోడ్డులో శివజ్యోతి హోటల్ సమీపంలో మూడంతస్తుల భవనం నిర్మాణం జరుగుతుంది. దుర్గా జనర్ధనరావు అనేవ్యక్తి ఈ భవనం నిర్మిస్తున్నారు. 150 చదరపు మీటర్లులో ఈ భవనం నిర్మిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ నిబంధనల మేరకు నిర్మాణం ముందు భాగంలో ఒకటిన్నర మీటర్లు విడిచిపెట్టాలి. మూడు వైపుల మీటర్ విడిచిపెట్టాలి. కనీసం నిబంధనలు పాటించకుండా ఈ నిర్మాణం సాగుతుంది. ఖాళీ స్థలం లేక పోవటంపై భవిష్యత్‌లో సమస్య తలెత్తే అవకాశం ఉంది. పట్టణంలో మరోపక్క రద్దీ పెరుగుతుంది. ఇక్కడ డబల్ రోడ్డు సైతం లేదు. ట్రాఫిక్ సమస్యగా ఉన్న ప్రాతం కావటంపై భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదురైయ్యే పరిస్థితి ఉంది. భవిష్యత్‌లో రోడ్డు విస్తరణ ప్రణాళికలో భాగంగా ఒకటిన్నర మీటర్లు ఖాళీ ఉంచాలన్న నిబంధనలు అధికారులు అమలు చేస్తున్నారు.



చౌకబజారులో నిబంధనలు అతిక్రమించి నిర్మిస్తున్న నిర్మాణం

నిబంధలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేక పోవటం వలన అమలు చేయటం లేదు. అధికారులు నిర్మాణం పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. మరోపక్క నిర్మాణం ప్రారంభంలో నిబంధలు అమలు చేస్తే ఈ సమస్య సైతం ఉండేది కాదు. ప్రస్తుతం భవనం గ్రౌండ్ ఫ్లోర్, మొదటి ఫ్లోర్ పూర్తయ్యింది. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సి ఉంది. లేదంటే భవిష్యత్‌లో ఇంకా నిబంధనలు అతిక్రమంచి నిర్మాణాలు జరిగే అవకాశం ఉందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నీ విషయంపై శ్రీకాకుళం నగర పాలక కమిషన్ ప్రసాదరావు వద్ద ప్రస్థావించగా నిర్మాణ నిబంధనలు పరిశీలించనున్నట్లు చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

## వైసిపి నాయకుల వ్యాఖ్యలు హాస్యాస్పదం

**ఆమదాలవలస :** రాష్ట్రంలో గత వైఎస్ పాలనలో ఇసుక, లిక్కర్, భూదందాలు చేసిన వైసిపి నాయకులు ఉచిత ఇసుకపై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని టిడిపి జిల్లా కార్యదర్శి మొదలవలస రమేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు నూక రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని నిమ్మతొర్లాడ వద్ద ఇసుక అక్రమ రవాణా జరుగుతుందంటూ అక్కడి ప్రజలను టిడిపికి చెందిన కొంతమంది దాడి చేసారంటూ లేనిపోని ప్రచార ఆర్భాటాలు చేయడం వైసిపి నాయకులకే చెందిందన్నారు. మంగళవారం వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్‌ను వెంటబెట్టుకొని పొందూరు వ్యవహరించే మాజీ డిప్యూటీ సిఎం, జిల్లా వైసిపి అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఇసుక రీచ్‌లకు వెళ్లి లేనిపోని ఆరోపణలు మాట్లాడడం తగదన్నారు. గత వైసిపి హయాంలో కృష్ణదాస్ తనయుడు వంశధార నదిలో సాగించిన ఇసుక దందాను జిల్లా ప్రజలు మరిచిపోలేదన్నారు. టిడిపి ప్రజలకు అందిస్తున్న ఉచిత ఇసుక విధానాన్ని జీర్ణించుకోలేక అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారన్నారు. సమావేశంలో రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల ఉపేంద్రరావు, పిఎసిఎస్ అధ్యక్షులు శిమ్మ మాధవి, పట్టణ టిడిపి అధ్యక్షులు సంపదరావు మురళి, గురుగుబెల్లి నాగేశ్వరరావు, కూన ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపునీరు

## చెరువును తలపిస్తున్న రోడ్డు

**నరసన్నపేట:** నరసన్నపేటలో బుధవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, గర్జనలతో గంటకు పైగా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. పట్టణంలోని వీధుల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో వర్షపునీరు రోడ్లపై ప్రవహిస్తుంది. దీంతో చెరువును తలపిస్తుందని స్థానికులు తెలిపారు. నాలుగైదు రోజులు పాటు ఈ విధంగా నీరు నిల్వ ఉంటుందని, దీనివల్ల దోమలు వ్యాప్తి చెందుతున్నాయని వాపోయారు. పంచాయతీ అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను శుభ్రం చేయాలని కోరుతున్నారు. అయితే వారం రోజులుగా మండుతున్న ఎండలు, ఉక్క పోతలో మగ్గిపోతున్న పట్టణవాసులకు ఈ వర్షం కాస్త చల్లదనాన్నివ్వడంతో ఆనందం వ్యక్తం చేసుకున్నారు.

## గర్భిణులకు వైద్య పరీక్షలు

**ఇచ్ఛాపురం :** జెసిఐ, ఓంశుభం మెడికల్ సంయుక్తంగా ఉచితంగా గైనకాలజీ సమస్యలపై బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు డాక్టర్ దీపిక పాడి 22 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు చైర్మన్ సంతోష్ సాహు ముఖ్య పాత్ర, జెసిఐ అధ్యక్షులు కాళ్ళ జైదేవ్, సెక్రటరీ డాక్టర్ మోహన్ వెంకటేష్, సంతోష్ సాహు, తంగుడు షణ్ముఖ, డిల్లీష్ తదితరులు పాల్గొన్నారు.

# అవగాహనతోనే నేరాల నియంత్రణ

**ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ**

అవగాహనతోనే నేరాలు నియంత్రించవచ్చునని, విద్యార్థి దశలో సెల్‌ఫోన్‌లు, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. సైబర్ నేరాలపై ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పోలీసు అధికారులు సూచించారు. బుధవారం జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో గల వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కళాశాలలు, పాఠశాలలు సందర్శించి విద్యార్థులకు మహిళ భద్రతపై విస్తృతంగా నారీశక్తి, సంకల్పం పేరిట అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా మహిళల భద్రత, శక్తియాప్ ఆవశ్యకత, ఉపయోగం, ప్రయోజనం, మహిళలపై సామాజిక మాధ్యమాల ద్వారా జరుగుతున్న వేధింపులు, సైబర్ మోసాలపై అప్రమత్తం, మహిళ చట్టాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు నియంత్రణపై అవగాహన కల్పించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930, డయల్ 112, శక్తియాప్ అత్యవసర నెంబర్లు గుర్తించుకుని, ఆపద, అత్యవసర సమయంలో ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.



శ్రీకాకుళం సిటీ : అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**పొందూరు:** యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసకావొద్దని ఎస్ఐ రమణమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని మానస వేద హైస్కూల్‌లో బుధవారం శక్తి టీం ఆధ్వర్యంలో పలు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోక్సోచట్టం, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, ఈవ్‌టీజింగ్, బాల్యవివాహాలు, బాల కార్మికుల నిర్మూలన, శక్తియాప్ వినియోగం వంటి పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కుమార్, శక్తిటీం సభ్యులు మోహనరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**శ్రీకాకుళం రూరల్:** యువత మాదకద్రవ్యాలకు బానిసై జీవితం నాశనం చేసుకుంటున్నారని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని రూరల్ ఎస్ఐ సూచించారు. మండలంలోని పెద్ద గనగళ్ళవాని పేటలో సంకల్పం కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**సోంపేట :** స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిఐ మంగరాజు శక్తి యాప్‌పై బుధవారం అవగాహన కల్పించారు. మహిళల భద్రతకు సంబంధించి ఎన్నో చట్టాలు ఉన్నాయని అన్నారు. మహిళా రక్షణ కొరకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని సూచించారు. ప్రస్తుత వాడుకలో ఉన్న మహిళ రక్షణకు సంబంధించిన యాప్‌లు, చట్టాల గురించి, వాటి వినియోగం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ లవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇసుక రీచ్ పరిశీలన

**ప్రజాశక్తి- ఆమదాలవలస**

మండలంలోని నిమ్మతొర్లాడ పంచాయతీలోని పాతూరు (పాత నిమ్మతొర్లాడ) ఇసుక రీచ్‌ను 2024 శాసనసభ ఎన్నికల ఇండిపెండెంట్ అభ్యర్థి సువ్వారి గాంధీ అనుచరులతో కలిసి బుధవారం పరిశీలించారు. ముందుగా అర్ధరాత్రి జరిగిన దాడిలో గాయపడిన బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానం పేరుతో ఇసుకను నదుల నుంచి తోడేస్తున్నారని విమర్శించారు. అర్ధరాత్రి పూట దాడులు జరగడం వెనక ఉన్న మతలబు ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. అడ్డగోలుగా ఇసుక దోపిడీ చేస్తున్న అధికార పార్టీ నాయకులపై సంబంధిత అధికారులు సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుని అక్రమ ఇసుక రేవు మూసివేతకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మాజీ ఎంపిటిసి కోరుకొండ సాయికుమార్, పేడాడ వైకుంఠరావు, అన్నెపు సూరిబాబు, ఎన్.తవిటిరెడ్డి, యతిరాజులు గోపి మోహన్, గురుగుబెల్లి రాజశేఖర్, సూరి, సనపల వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న గాంధీ తదితరులు

## రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

**ఆమదాలవలస :** మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కొత్తవలస, పాతూరు, నిమ్మతొర్లాడ, జి.కె.వలస, కొరపాం, చేపేన పేట, రామచంద్రపురం, చిట్టివలస, చెవ్వాకులపేట గ్రామాల్లో పనులు, విద్యుత్ లైన్ల మార్పుట, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు వలన శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలియజేశారు. ఈ అంతరాయాన్ని విద్యుత్ వినియోగదారులు గ్రహించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

## అర్హులకు సంక్షేమ పథకాలు

**పలాస :** కూటమి ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని కేదారిపురంలో బుధవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి చౌదరి బాబ్జి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు వంకల కూర్మారావు, పాడి దుర్యోధన, నారాయణకుమార్ స్వామి, సిసింద్రీ, పొలాకి ధనుంజయ, కేశవరావు, వాసు, లక్ష్మణరావు, తులసీదాసు, కృష్ణారావు, చలపతి పాల్గొన్నారు.



పోస్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

## సర్పంచ్‌లు, ఎంపిటిసిలంటే అంత చులకనా?

**కవిటి:** ప్రజలు వేసిన ఓట్లు ద్వారా ఎన్నికైన సర్పంచ్‌లు, ఎంపిటిసిలు అంటే ఉద్యోగస్తులకు అంత చులకనా? అంటూ వైసిపి జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు కాయ భీమసేన్, కపాసుకుద్ది సర్పంచ్ కాయ దమయంతి ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. తమ పంచాయతీ పరిధిలో చేపట్టిన ఎరువుల పంపిణీ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్‌కు, ఎంపిటిసిలకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. తమని పిలవడం అధికారులకే ఇష్టం లేదా? కూటమి నాయకులు వద్దని అన్నారా? అన్న విషయం తమకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాయకులు వస్తుంటారు, పోతుంటారని కానీ, అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన బాధ్యత కలిగి ఉంటారని అన్నారు. కానీ, వారే ఈ విధంగా వ్యవహరించడం సరికాదని హితవు పలికారు. ప్రజల ఓట్ల ద్వారా గెలిచిన ప్రజాప్రతినిధులను మరచి ఎటువంటి పదవులు లేని వారితో ఏ విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారో సంబంధిత అధికారులు తమకు చెప్పాలని, లేదంటే దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న దమయంతి, భీమసేన్



కోటబొమ్మాళి : ఎరువులను పంపిణీ చేస్తున్న హరివరప్రసాద్

## ఎరువుల పంపిణీ

**ప్రజాశక్తి- కోటబొమ్మాళి**

ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందిస్తున్న సంక్షేమ పథకాలు రైతులు, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్ అన్నారు. మండలంలోని పెద్దబమ్మిడి రైతు సేవా కేంద్రం వద్ద ఎఒ గోవిందరావుతో కలిసి రైతులకు బుధవారం ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు కావాల్సిన అన్ని రకాల ఎరువులు అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఉందుబాటులో ఉన్నాయని రైతులకు తెలిపారు. పాడి రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న పశువుల దాణాను స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్‌తో కలిసి నిమ్మాడ రైతు సేవా కేంద్రంలో పాడి రైతులకు అందజేశారు.కార్యక్రమంలో పెద్దబమ్మిడి, చిన్నబమ్మిడి మాజీ సర్పంచ్‌లు, వ్యవసాయ, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**కవిటి:** ఖరీఫ్ సీజన్ దృష్ట్యా రైతులకు కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచినట్టు ఎఒ పిరియా శ్రీదేవి తెలిపారు. మండలంలోని కపాసుకుద్దిలో బుధవారం రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రతి ఆర్‌ఎస్‌కెలో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో విహెచ్ఎ గౌతమి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



అభినందిస్తున్న చైర్మన్ తులసీదాస్‌రెడ్డి

## స్వర్ణభారతి విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి- ఇచ్ఛాపురం**

డిగ్రీ 4వ సెమిస్టర్ ఫలితాల్లో స్వర్ణభారతికి చెందిన ప్రతిభ కనబరిచారని చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి బుధవారం తెలిపారు. బి.కాం కంప్యూటర్ అప్లికేషన్స్ గ్రూప్‌కి సంబంధించి ఎ.ఎస్.పేటకు చెందిన బనిశెట్టి ప్రియదర్శిని 9.3 పాయింట్స్ సాధించి నియోజకవర్గస్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకుందన్నారు. దుర్గాసి ఐశ్వర్య కంప్యూటర్ సైన్స్ గ్రూప్‌కు సంబంధించి 9.0 పాయింట్లు సాధించినట్లు తెలిపారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కొనియాడారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ చాట్ల రాము, డిగ్రీ, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాళ్లు సందీప్, జయప్రకాష్ పాల్గొన్నారు.

## తిలక్, ఆజాద్ సేవలు మరువలేనివి

**ప్రజాశక్తి- కవిటి**

బాలగంగాధర తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ భారత స్వతంత్ర ఉద్యమంలో చేసిన సేవలు మరువ లేని మరువలేనివని బివికె ప్రధానాచార్య మార్పు అనిల్, కళ్యాణి ఆంగ్ల పాఠశాల ప్రిన్సిపాల్ బిందు మాధవి అన్నారు. భారతీయ విద్యాకేంద్రం వారి ఆర్ష విజ్ఞాన భారతి, కళ్యాణి పాఠశాలల్లో బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానాచార్య అనిల్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా తిలక్, ఆజాద్ చిత్రపటాలకు పూలమాలలతో అలంకరించి, ఘన నివాళులు అర్పించారు. అనంతరం, విద్యార్థులకు గణేశ్ ఉత్సవాల ఏర్పాటులో తిలక్ పాత్ర, ఆజాద్ విప్లవ జీవితం వంటి విశేషాలను వివరిస్తూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిరీష, సుహాసిని, జ్యోతి, అంజలి, ఝాన్సీ, కృష్ణ కుమార్, లక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.





రక్తదానం చేస్తున్న అక్షిత్

## ఆపదలో అండగా... మనసు నిండుగా

**ప్రజాశక్తి- కవిటి**

అత్యవసర పరిస్థితుల్లో అండగా నిలిచిన ఓ యువకుడు తన మంచి మనసు చాటుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే... రాపాకపుట్టుగకు చెందిన ఓ గర్భిణికి ప్రసవ సమయంలో ప్లేట్లెట్స్ తగ్గిపోవడంతో అత్యవసరమై ఎ పాజిటివ్ ఎస్‌డిపి అవసరమైంది. సమయానికి ఆ గ్రూపు రక్తం అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని బొరివంకకు చెందిన హెల్పింగ్ హేండ్స్ సంస్థ సభ్యుడు కాళీ సాహు ద్వారా తెలుసుకున్న లోళ్లపుట్టుగకు చెందిన లోళ్ల అక్షిత్ తాను రక్తం ఇస్తానని ముందుకొచ్చాడు. వెంటనే ఆస్పత్రికి చేరుకుని రక్తదానం చేసి రెండు నిండు ప్రాణాలు కాపాడు. దీంతో ఆపరేషన్ చేసిన వైద్యులు బిడ్డను క్షేమంగా బయటకు తీశారు. తమ బిడ్డ ఆపద సమయంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన అక్షిత్‌కు బాధిత కుటుంబ సభ్యులు నిండు మనసుతో దీవించారు.



పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

## పశువులకు లంపి స్కిన్ టీకాలు

**ప్రజాశక్తి- లావేరు**

మండలంలోని మురపాక, కొత్తకుంకాం, పాతకుంకాం, లావేరు, కూనపువానిపేట గ్రామాల్లో బుధవారం 800 పశువులకు ముద్దచర్మవ్యాధి టీకాలు వేయడం జరిగిందని బెజ్జపురం పశువైద్యాధికారి లావణ్య అన్నారు. ప్రతి రైతు పాడి రైతు ఈ టీకాలు తప్పనిసరిగా పశువులకు వేయించాలన్నారు. మండలంలోని ప్రతి సచివాలయం పరిధిలో సిబ్బంది వచ్చి టీకాలు వేయడం జరుగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది రవిబాబు, శ్రీనివాస్, గోపాలమిత్ర, నాగరాజు, జగదీష్ తదితరులున్నారు.

# ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



లైన్ షోయింగ్ పద్ధతిలో వరినాట్లు నాటుతున్న రైతులు

**ప్రజాశక్తి- ఆమదాలవలస**

ప్రకృతి వ్యవసాయంతో పంటల సాగు వలన రైతులకు ఎంతో లాభదాయకమని ప్రకృతి వ్యవసాయ సిడిఎఫ్ చేపేన సురేష్ అన్నారు. బుధవారం చేపేనపేటలో డిపిఎం పూజారి సత్యనారాయణ ఆదేశాల మేరకు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో పంట పొలాల్లో లైన్ షోయింగ్ పద్ధతిలో నాట్లు వేయించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వలన పెట్టుబడులు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. ప్రకృతి సేద్యంలో పండించిన పంట ఉత్పత్తులకు అధిక ధర కూడా ఉంటుందని, క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ఎక్కువ విస్తీర్ణంలో విస్తరింప చేయడానికి అవసరమైన ప్రోత్సాహాన్ని రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ లైన్‌షోయింగ్ చేసుకోవడం వలన పంటలో మంచి దిగుబడులు రావడంతో పాటు నాణ్యమైన పంట ఉత్పత్తి కూడా వస్తుందన్నారు. చేపేనపేట, నిమ్మతొర్లువాడ గ్రామాల్లో లైన్ షోయింగ్ పద్ధతులను ఎక్కువ విస్తీర్ణంలో రైతులతో చేయించడంతో పాటు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పంటల్లో ఆచరణ చేసే దశగా రైతులకు ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రశాంతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్పెంటర్‌కు ఆర్థికసాయం

**ప్రజాశక్తి- కవిటి**

మండలంలోని డి.గొనపపుట్టుగకు చెందిన కార్పెంటర్ చిత్రాడ జగ్గారావుకు హనుమాన్ హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. జగ్గారావు సైకిల్‌పై వెళ్తూ కిందపడిపోవడంతో కాలు విరిగింది. డాక్టర్లు ఆరు నెలల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. దీంతో 55 ఏళ్ల వయసులో ఎటువంటి ఆర్థిక ఆసరా లేని జగ్గారావు జీవనం భార్యపై ఆధారపడి ఉంది. ఈ విషయం తెలుసుకున్న హనుమాన్ హెల్పింగ్ హాండ్స్ సంస్థ స్పందించి జగ్గారావుకి రూ.5,200లు ఆర్థిక సహాయం అందించింది. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ ఎటువంటి ఆసరా లేని జగ్గారావుకు అండగా మరిన్ని సేవా సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

## వైద్య శిబిరానికి స్పందన

**ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్**

గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని పెద్దగనగళ్లవాని పేటలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంపును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే చేతులమీదుగా రోగులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో బర్రి రామారావు, చీకటి అమ్మోజీరావు, వైద్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## ధర్మాన సోదరులను కలిసిన లక్ష్మణరావు

**ప్రజాశక్తి- లావేరు**

మాజీ మంత్రులు, వైసిపి నాయకులు ధర్మాన సోదరులు కృష్ణదాస్, ప్రసాదరావులను మురపాక సర్పంచ్ భర్త వైసిపి రాష్ట్ర ఎస్‌సి విభాగం జాయింట్ సెక్రటరీ పెయ్యల లక్ష్మణరావు బుధవారం శ్రీకాకుళం, మబుగాంలో వేరువేరుగా మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు సాలువతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రణాళికా బద్ధంగా కష్టపడి పని చేయాలని సూచించారు.

# బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

**ప్రజాశక్తి- పొందూరు**

మే నెలలో జరిగిన బదిలీల్లో వెబ్ ఆధారిత కౌన్సెలింగ్‌లో కొత్త పాఠశాలల్లో చేరిన ఉపాధ్యాయులను రిలీవ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బదిలీల్లో వారు కోరుకున్న పాఠశాలలకు బదిలీ అయినప్పటికీ రిలీవర్ లేరనే నెపంతో వారిని రిలీవ్ చేయకుండా తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. అర్హత కలిగిన ఎంటిఎస్ ఉపాధ్యాయులను బదిలీ అయినా కూడా రిలీవ్ కాని ఉపాధ్యాయుల స్థానంలో డిప్యుటేషన్ వేయాలని విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా కొత్తగా మంజూరైన ఉపాధ్యాయ పోస్టుల్లో నియమితులైన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడిలు కేటాయించి జీతాలు చెల్లించే విధంగా కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. బకాయిలు విడుదల చేయక, పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేసి ఐఆర్, డిఎలు మంజూరు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో డిటిఎఫ్ సంఘ బాధ్యులు చౌదరి వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరిప్రసన్న

# శాస్త్రీయ పద్ధతులపై అవగాహన

**ప్రజాశక్తి- ఇచ్ఛాపురం**

శాస్త్రీయ పద్ధతులపై వ్యవసాయం చేస్తే మంచి దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ ఎడిఇ టి.భవానీశంకర్, ఎఒ అజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని తెలుకుంచి, తులసిగాం గ్రామాల్లో బుధవారం 'పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆకు చివర్ల కత్తిరింపు, సరియైన అంతర దూరంతో నాట్లు వేయడం, కలుపు మందు పిచికారీ వంటి సాంకేతిక పద్ధతులు ప్రదర్శించారు. ఇవి మొక్కల ఆరోగ్య వృద్ధికి, వ్యాధి నివారణకు, సమర్థవంతమైన పోషకాలను గ్రహించడానికి ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం తెలుకుంచి రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి సాయిచరణ్, మాజీ సర్పంచ్ మెరుగు సూర్యనారాయణరెడ్డి, రైతులు లోహిత్, మారెయ్య పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

# బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్ఎం తదితరులు

**ప్రజాశక్తి- పొందూరు**

మండలంలోని తాడివలస ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం హెచ్ఎం బల్ల కంటయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎంలుగా ప్రమోషన్‌పై వెళ్లిన ముగ్గురు ఉపాధ్యాయులు సాయికుమార్, హరిప్రసన్న, గున్నేశ్వరరావులతో పాటు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు వేణుగోపాలరావు, రాంబాబు, రాజేంద్రప్రసాద్‌లను ఘనంగా సన్మానించారు. స్వర్ణోత్సవ కళావేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఎనిమిదేళ్ల పాటు ఉపాధ్యాయులు పాఠశాలకు చేసిన సేవలను విద్యార్థుల ప్రగతికి చేసిన కృషిని కొనియాడారు. జిల్లాలోనూ, రాష్ట్రంలోనూ తాడివలస ఉన్నత పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు రావడంలో ఎనలేని కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం దృష్టికి పలు సమస్యలు

**ప్రజాశక్తి- రణస్థలం రూరల్**

ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సిఎం నారా చంద్రబాబు నాయుడుని ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో బుధవారం కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతులు సమర్పించారు. సిఎం చంద్రబాబు నాయుడు ప్రతి అంశాన్ని సానుకూలంగా పరిశీలించి వెంటనే స్పందించారు. మడ్డువలస ఫేస్-2 పనులు, తోటపల్లి కాలువ ఫేస్ 2 పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థనపై, సిఎం త్వరితగతిన నిధులు మంజూరు చేస్తామని హామీఇచ్చారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన విన్నపంపై, తక్షణమే పనులు ప్రారంభించేందుకు అధికారులను ఆదేశించారు. సిఎం సహాయనిధి కింద నియోజకవర్గానికి సుమారు రూ.20 లక్షల విలువైన చెక్కులను మంజూరు చేశారు. నియోజకవర్గానికి సంబంధించి పలు అంశాలపై చర్చించినట్లు ఎమ్మెల్యే ఎన్ఇఆర్ తెలియజేశారు. ఎమ్మెల్యే పనితీరుపై, ప్రజా సమస్యలపై చూపిస్తున్న చొరవపై ప్రశంసించినట్లు తెలిపారు.



సిఎంకు సమస్యలను వివరిస్తున్న ఎన్ఇఆర్

# బాబు మోసాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**ప్రజాశక్తి- కవిటి**

ఎన్నికల మేనిఫెస్టోలో అమలుకాని హామీలు ఇచ్చి ప్రస్తుతం వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న మోసాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ పిలుపునిచ్చారు. మండలంలోని కర్రివానిపాలెం లో వైసిపి విస్తృత స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ, ప్రజలను మోసగించిన విధానాలను బహిర్గతం చేయడానికి వైసిపి చేపట్టిన బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ నాలుగో దశలో భాగంగా ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఏకమై ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలు ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలని సూచించారు. ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, సర్పంచ్‌లు ఎస్.పి.నారాయణస్వామి, గండుపిల్లి హనుమంతు, దూగాన భద్రాచలం, ఎంపిటిసి పూడి నీలాచలం, కో-ఆప్షన్ మెంబర్ పాండవ చంద్రశేఖర్, జెఎసి కన్వీనర్ జల్లు యుగంధర్, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ యలమంచి నీలయ్య పాల్గొన్నారు.

**ఆమదాలవలస :** కూటమి ప్రభుత్వ పాలన అధ్వాన్నమని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. బుధవారం పురపాలక సంఘంలోని ఒకటో వార్డు తిమ్మాపురం, 23వ వార్డు లక్ష్మడుపేటలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు ప్రజలకు ఎన్నో అలవి కాని హామీలిచ్చి తీరా అధికారంలోకి వచ్చాక వాటిని నేరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. గడచిన వైసిపి పాలనలో పేదలకు ఇచ్చిన పింఛన్లను ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం చాలా వరకు తొలగించి పేదల జీవన ప్రమాణాన్ని దెబ్బతీసిందని మండిపడ్డారు. పేదలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్, పట్టణ అధ్యక్షులు పొడుగు శ్రీనివాసరావు, వార్డు ఇన్‌ఛార్జి సంపదరావు రామారావు, వైసిపి నాయకులు దుంపల శ్యామలరావు, దుంపల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

**సంతబొమ్మాళి :** మండలంలో పాలతలగాం, ఆర్‌హెచ్‌పురం, జగన్నాథపురం గ్రామాల్లో వైసిపి నాయకులు బుధవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వైసిపి మండల అధ్యక్షులు మోహన్‌రెడ్డి ఆధ్వర్యాన కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం విస్మరించిన హామీలు వివరించారు. కార్యక్రమంలో కెళ్లి జగన్నాయకులు, ఎంపిపి ప్రతినిధి మేరుగు అప్పారావు, వైస్ ఎంపిపి ప్రతినిధి నక్క భీమారావు, జిల్లా కార్యదర్శి ఎన్ని మన్మథరావు, డి.జి.పురం, సర్పంచ్ మార్పు నాగభూషణ్, సర్పంచ్‌లు ఉప్పాడ లోకనాథం, నక్కిట్ల అప్పన్న, జోగి రాములమ్మ, ఎంపిటిసిలు అట్టాడ అప్పలనాయుడు, జొన్న సవర్‌రాజు పాల్గొన్నారు.

**శ్రీకాకుళం రూరల్ :** కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలు ఇచ్చి అధికారం చేపట్టిందని వైసిపి రూరల్ అధ్యక్షుడు చిట్టి జనార్ధన అన్నారు. మండలంలోని బైరువానిపేట, పాత్రునివలస లో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదేశాల మేరకు బాబు షురిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికి వెళ్లి టిడిపి యువతను ఎలా మోసం చేసిందో వివరించారు. వైసిపి నాయకులు అంబటి శ్రీనివాసరావు, ఎం.తాతబాబు, వైకుంఠరావు, గేదెల పురుషోత్తం, ఎచ్చెర్ల శ్రీధర్, బాణాల గాంధీ తదితరులు పాల్గొన్నారు.